







కలల సౌధం కళ్ల ముందు వాలింది. ఆశల రాజధాని అంగరంగ వైభవంగా ఆవిష్కృతమైంది. అమరావతి 2.0కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన వేడుకకు రాష్ట్రవ్యాప్తంగా జైత్రయాత్ర కదిలింది. దారులన్నీ వెలగపూడివైపే సాగాయి. రూ.49,040 కోట్లతో కూడిన ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన, కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవంతో రాజధాని అంతటా పండుగ వాతావరణం కనిపించింది. వికసిత అమరావతే లక్ష్యమంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా సాగగా, తెలుగులో ఆయన మాట్లాడిన తీరుకు సభికుల నుంచి హర్షధ్వానాలు మిన్నంటాయి. అమరావతి చరిత్రను కీర్తిస్తూ, రైతుల త్యాగాలను ఉటంకిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రసంగం రాజధాని ఔన్నత్యాన్ని తెలియజేసింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు వేదికలను అలంకరించగా, సభా ప్రాంగణంలో అమరావతి రైతులకు అగ్రస్థానం లభించింది. అంబరాన్నంటిన ఈ వేడుకకు వాతావరణం కూడా చల్లగా మారగా, జనాలు తండోపతండాలుగా తరలివచ్చి అమరావతికి జేజేలు పలికారు.

గ్యాలరీలు నిండిపోవడంతో వేదిక బయట నుంచే ప్రధాని ప్రసంగాన్ని వింటున్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) సభావేదికపై పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు చిరునవ్వులు

అమరావతి 2.0





జయహో..

వేడుకలా రాజధాని పునః ప్రారంభోత్సవం

ప్రధాని మోదీ రాకతో పండుగ వాతావరణం

అమరావతి ఔన్నత్యాన్ని కీర్తించిన సీఎం చంద్రబాబు

- కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- నాగాయలంక మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ వర్చువల్ ప్రారంభం
- దేశ రక్షణకు నవశక్తిని ఇస్తుందంటూ ప్రధాని వ్యాఖ్య
- విజయవాడ-కాజీపేట మూడోలైన్ జాతికి అంకితం

దారులన్నీ రాజధానివైపే.. భారీగా తరలిన జనం

- వందలాది వాహనాలతో పార్కింగ్ ప్రాంతాలు ఫుల్

కిక్కిరిసిపోయిన సభా ప్రాంగణాలు, గ్యాలరీలు

విజయవాడ/గుంటూరు/తుళ్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి జనసంద్రంగా మారింది. వెలగపూడి వేదికగా రాజధానిలో రూ.49 వేల కోట్ల పనులకు, నిర్మాణాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు ప్రధాన వేదికపై ఆసీనులు కాగా, ఈ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. రాజధాని గ్రామాల ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. సభ జరిగే వెలగపూడితో పాటు అన్ని గ్రామాల్లోనూ ఇదే వాతావరణం కనిపించింది. సభకు వెళ్లే మార్గాలన్నీ వాహనాలు, జనంతో నిండిపోయాయి. కాగా, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగాయలంకలో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశరక్షణ వ్యవస్థలో కీలకపాత్ర పోషించనున్న మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌ను నవదుర్గగా అభివర్ణించారు. అమరావతి రాజధానికి అన్నివిధాలా సహకరిస్తానని ఆయన చెప్పటంతో సభికులు చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తపరిచారు. అలాగే, విజయవాడ-కాజీపేట మూడోలైన్ మార్గాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. అమరావతి కోసం భూ సమీకరణలో భూములిచ్చిన మిగతా 6లో..

బస్సెనక బస్సు




(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అన్నిదారులూ అమరావతివైపే సాగాయి. వందలాది బస్సులు అమరావతికి క్యూ కట్టాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి అంచనాలకు మించి బస్సుల్లో తరలివచ్చారు. దీంతో జాతీయ రహదారులన్నీ కిటకిటలాడాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 400 ఆర్టీసీ బస్సులు, 2,500కు పైగా ప్రైవేట్ బస్సుల్లో అమరావతి వెళ్లారు. ఇవికాకుండా సొంతకార్లు, ఇతర వాహనాల్లోనూ బయల్దేరి వెళ్లారు. హైదరాబాద్ నుంచి కూడా తండోపతండాలుగా వాహనాలు తరలివచ్చాయి. ఈ వాహనాలన్నీ ఎన్టీఆర్ జిల్లా మీదుగానే వెళ్లాల్సి రావడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది. పోలీసుల ముందస్తు ప్రణాళికల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాలేదు. భారీ వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్లించడంతో సమస్యలు తలెత్తలేదు. బస్సులు భారీగా తరలివస్తుండటంతో అధికారులు ఒకింత ఆందోళన చెందారు. మధ్యాహ్నం 2 గంటలకే అమరావతిలో సభా ప్రాంగణం పక్కనే ఏర్పాటు చేసిన వాహనాల పార్కింగ్ ప్లేస్‌లు నిండిపోయాయి. వస్తున్న వాహనాలకు చోటు లేకపోవటంతో నగరం బయటే వాహనాలను నిలుపుదల చేశారు. చాలామంది నడుచుకుని అమరావతి వెళ్లారు. అశేషంగా వస్తున్న ప్రజలకు భోజన ఏర్పాట్లు కూడా సరిపోకపోవడంతో అదనంగా ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

ఆటంకాలు లేకుండా అమరావతికి..

కీలకంగా మారిన పశ్చిమ బైపాస్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్రంలో ఎక్కడెక్కడి నుంచో బస్సులు కదిలొచ్చినా విజయవాడపై మాత్రం ఆ ప్రభావం పడలేదు. సాధారణ వాహనదారులు ముందుకు సాఫీగా సాగిపోయారు. దీనంతటికీ ప్రధాన కారణం పశ్చిమ బైపాస్ రోడ్డు మార్గమే. వెలగపూడిలో రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం భారీస్థాయిలో నిర్వహించినా నగరం మీదుగా ఎలాంటి బస్సులు రాకపోకలు సాగించకుండా ఈ రోడ్డు ప్రధానంగా నిలిచింది. బస్సులన్నీ నగరంలోకి ప్రవేశించకుండానే అమరావతి చేరుకున్నాయి. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల నుంచి బస్సులు భారీగా రాగా, గన్నవరం నుంచి నిర్మించిన పశ్చిమ బైపాస్ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకున్నాయి. ఇందుకు కృష్ణా బ్రిడ్జి కూడా కీలకంగా ఉపయోగపడింది. ఫలితంగా గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన బస్సులు నేరుగా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వెలగపూడి చేరుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నుంచి బయల్దేరిన వాహనాలు కూడా ఇదే మార్గంలో వెళ్లాయి. కృష్ణాజిల్లా నుంచి కొన్ని బస్సులు మాత్రం వారధి మీదుగా వెళ్లాయి.



వెలుగులీనుతున్న ప్రకాశం బ్యారేజీ



జాతీయ జెండాతో స్కేటింగ్ క్రీడాకారుల విన్యాసం



రక్షణరంగ ఆకాంక్షలు సాకారం

నాగాయలంక నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ పనులు ప్రారంభం 8లో

దశదిన కర్మకు వెళ్తుండగా

దారుణం

రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం

జొన్నపాడు పెట్రోల్ బంకు వద్ద ఘటన





రామాంజనేయులు, సీతామహాలక్ష్మి (ఫైల్)

పెదపారుపూడి/గుడ్లవల్లేరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : చనిపోయిన బంధువు దశదిన కర్మకు బయల్దేరిన ఆ జంటకు అదే ఆఖరిరోజు అయ్యింది. పెదపారుపూడి పరిధిలోని జొన్నపాడు పెట్రోల్ బంకు వద్ద కారు ఢీకొని మిగతా 6లో..

పుట్టినింటి నుంచి మెట్టినింటికి..

పాకిస్థాన్‌కు చెందిన బెజవాడ కోడలు ప్రయాణం

- దేశాలు వేరైనా పెద్దలు కుదిర్చిన పెళ్లి
- ఉగ్రదాడికి ముందు పాకిస్థాన్‌కు పయనం
- ఆంక్షల నేపథ్యంలో ఆగమేఘాలపై భారత్‌కు..
- వీలుకుదిరినప్పుడల్లా విహారయాత్రలు
- భర్త, కూతురుతో కలిసి ఉన్న ఫొటోలు వైరల్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మోనికా రజని.. భారత్-పాక్ యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తున్న పేరు. పాకిస్థాన్‌లోని కరాచీలో పుట్టిన ఈమె నగరంలోని గురునానక్ కాలనీకి చెందిన పవన్ బొడానిని 2016లో వివాహం చేసుకున్నారు. అయితే, ఇటీవలే ఆమె పుట్టినింటికి వెళ్లారు. ఆ తర్వాత ఉగ్రదాడి జరగటం, రెండు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవటం, స్థానికేతరులు తిరిగి వెళ్లిపోవాలని రెండు దేశాలు ప్రకటించడంతో మోనిక పేరు వెలుగులోకి వచ్చింది. ఆమె మిగతా 6లో..

అన్యోన్య దాంపత్యం

మోనికా రజని, పవన్ బొడాని దంపతులను చూస్తే చూడముచ్చటేస్తుంది. పాకిస్థాన్‌లో పుట్టినా ఆమె భారత పండుగలను ఘనంగా జరుపుకొంటారు. దీపావళి పండుగంటే చాలా ఇష్టపడతారు. తన కూతురు సమైరాను ఇటీవల క్యూటెస్ట్ బేబీ కాంపిటీషన్‌లో పాల్గొనేలా చేశారు. భర్త పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఐ లవ్ మై హస్బెండ్ అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

గృహనిర్మాణ శాఖలో అవినీతిపై

చర్యలకు సిద్ధం

- చల్లపల్లి మండలంలో రూ.33 లక్షల అవినీతి
- డీఈ, ఏఈ, ఎంబీసీలను బాధ్యులు చేస్తూ.. వారి నుంచి రికవరీ చేయాలని నిర్ణయం
- కేసులు నమోదు చేసే అవకాశం?

8లో



అద్భుతంగా అమరావతి


పవన్ స్వాగతం.. లోకేశ్, మోదీ చమత్కారం


కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు


సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు


మహిళల విజయ దరహాసం



అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి

దుర్గమ్మను దర్శించుకుని సభావేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పలనాయుడు


సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు


సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు


గ్యాలరీల బయట జనం


గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎంపీలు కేశినేని శివనాథ్, బాలశౌరి, కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్దప్రసాద్, కామినేని శ్రీనివాస్


వేదికలు నిండిపోవడంతో బయట నుంచే ప్రధాని ప్రసంగం వింటున్న ప్రజలు

జయహో..

(5వ పేజీ తరువాయి)

రైతులు మురిసిపోయారు. ఐదేళ్ల అష్టకష్టాలు పడ్డామని, తిరిగి అమరావతికి ప్రాణం పోస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. సభలో అమరావతి రైతులకు అగ్రస్థానాన్ని అందజేశారు. ఏ ప్లస్ పాసులు ఇచ్చి ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రవేశ ద్వారంలో అనుమతించారు.

అన్నిదారులూ అమరావతివైపే..

అమరావతిని చూడాలన్న ఆకాంక్షతో రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటలకే రాజధానికి దారి తీసే మార్గాల్లో జనసందోహం కనిపించింది. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వివిధ ప్రాంతాల ప్రజలు సాయంత్రం 6 గంటలకు సభ ముగిసిన సమయంలో కూడా ప్రాంగణానికి చేరుకుంటూనే ఉన్నారు.

మధ్యాహ్నానికే కిటకిట

వేలాదిగా ప్రజలు తరలిరావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నాం 12 గంటలకే నిండిపోయింది. గ్యాలరీలన్నీ నిండిపోవడంతో ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకున్న వారు రోడ్లపైనే ఉండాల్సి వచ్చింది. పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఈ-6, 7, 8 రోడ్ల వరకు, ఎన్-9 రోడ్డు, సచివాలయం చుట్టుపక్కల రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణానికి చుట్టుపక్కల కిలోమీటరు మేర ఎటు చూసినా జనమే కనిపించారు.

వెల్లివెరిసిన జాతీయత

రాజకీయ పార్టీల జెండాలకు ఆస్కారం లేకుండా అమరావతి పునర్నిర్మాణ పండుగ జరిగింది. ప్రజలు మూడు రంగుల జెండాలను ప్రదర్శిస్తూ జాతీయతను చాటారు. సభ వెలుపల, సభా ప్రాంగణంలో ఎక్కడా ఏ పార్టీ జెండాల ప్రదర్శన లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కేవలం మువ్వన్నెల జాతీయ జెండాను మాత్రమే అనుమతించారు. ప్రధాని సభావేదిక మీదకు రాగానే ప్రజలు వందేమాతరం.. అంటూ స్వాగతం పలికారు. అమరావతి రైతులు జయహో... అమరావతి అంటూ పచ్చ కండువాలు గాలిలో ఊపారు. అలాగే, ప్రధాని హెలిప్యాడ్ మొదలు సుమారు 1.3 కిలోమీటర్ల దూరం పొడవునా సభా ప్రాంగణం వరకు జాతీయ జెండాలతో అలంకరించారు.


ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గవర్నర్ నజీర్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, రఘురామ కృష్ణంరాజు

ప్రధాని మోదీకి ఘనస్వాగతం, వీడ్కోలు

» గన్నవరం విమానాశ్రయంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు

గన్నవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి విజయవాడ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. కేరళలోని తిరువనంతపురం నుంచి గన్నవరం విమానాశ్రయానికి శుక్రవారం మధ్యాహ్నాం 2.49 గంటలకు 'ఇండియా వన్' ప్రత్యేక విమానంలో మోదీ వచ్చారు. విమానం నుంచి దిగుతూనే మోదీ అభివాదం చేశారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, కృష్ణా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్(చిన్ని), సీఎం రమేష్, తెన్నేటి కృష్ణప్రసాద్, పాక వెంకట సత్యనారాయణ, చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, యార్లగడ్డ వెంకట్రావు, సోము వీర్రాజు, కొణిదెల నాగబాబు, యలమంచిలి సుజనాచౌదరి, కామినేని శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంత రాము, డీజీ అంజనీకుమార్, ఇంటెలిజెన్స్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ అభిషేక్, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావులు ప్రధాని మోదీకి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. విమానాశ్రయం నుంచి వాయుసేన హెలికాప్టర్‌లో అమరావతికి మోదీ బయలుదేరి వెళ్లారు.

భారీ బందోబస్తు ఏర్పాట్లు

ప్రధాని మోదీ రాకను పురస్కరించుకుని గన్నవరం విమానాశ్రయం పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ పర్యవేక్షణలో అడుగడుగునా పోలీసు బలగాలు ముమ్మర తనిఖీలు చేపట్టాయి.

ప్రధాని మోదీకి ఘన వీడ్కోలు

అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపనతో పాటు, రైల్వే, ఎన్‌హెచ్ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం వాయుసేన హెలికాప్టర్‌లో ప్రధాని విజయవాడ విమానాశ్రయానికి బయలుదేరారు. ప్రధానితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు మోదీతో హెలికాప్టర్‌లో విజయవాడ విమానాశ్రయానికి సాయంత్రం 6.07 గంటలకు చేరుకున్నారు. కూటమి నాయకులు, అధికారులతో మోదీ కొద్దిసేపు ముచ్చటించి ప్రత్యేక విమానంలో 6.44 గంటలకు ఢిల్లీ వెళ్లారు. ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం చంద్రబాబు రోడ్డు మార్గాన ఉండవల్లిలో తన నివాసానికి వెళ్లారు.

పంచుమర్తి అనూరాధకు ప్రధాని పరామర్శ

ఢిల్లీకి తిరిగి వెళ్లే క్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధను ప్రధాని ప్రత్యేకంగా పలకరించారు. తాను బలహీన వర్గానికి చెంది.. కేన్సర్‌తో బాధపడుతున్నా పార్టీలో కష్టపడి పనిచేస్తుండటాన్ని చంద్రబాబు గుర్తించి గౌరవంగా ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని అనూరాధ చెప్పగా.. రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోండి.. చంద్రబాబు మీకు మంచి అవకాశం ఇచ్చారు. అది నిలబెట్టుకోవాలి' అని మోదీ అన్నారు.


విమానాశ్రయంలో నిర్మిస్తున్న టవర్ సమీపం నుంచి పొగ

విమానాశ్రయంలో అగ్ని ప్రమాదం!

గన్నవరం : గన్నవరం విమానాశ్రయంలో శుక్రవారం మధ్యాహ్నాం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రధాని మోదీ వచ్చే ముందు విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న టవర్ సమీపంలో మంటలు వ్యాపించాయి. ఆ ప్రాంతం ఖాళీగా ఉండటంతో ఎండిపోయిన గడ్డి, చెత్త, చెట్లు ఉన్నాయి. సరిగ్గా ప్రధాని వచ్చే ముందు మంటలు ఎగసిపడ్డాయి. దట్టంగా పొగ వ్యాపించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న టవర్ దగ్గర పనిచేసే కూలీలకు సెలవు ఇచ్చారు. అయితే ఆ సమీపంలోనే కూలీలు ఉంటున్నారు. బహిర్భూమికి వెళ్లి బీడీ, సిగరెట్ కాల్చి ఎండిపోయిన గడ్డి మీద వేసి ఉంటారని భావిస్తున్నారు. మంటలు ఎగసిపడటంతో విమానాశ్రయంలో ఏం జరిగిందోనని చుట్టుపక్కల నివాసితులు ఆందోళన చెందారు.

పుట్టినింటి నుంచి..

(5వ పేజీ తరువాయి)

రాకపై ఉత్కంఠ నెలకొనగా, రెండు రోజుల కిందటే అమృత్‌సర్‌కు చేరుకోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తాజాగా ఆమె ఫొటోలు వైరల్ అవుతున్నాయి. తన ఐదేళ్ల కుమార్తెతో క్షేమంగా చేరుకోవడంతో పాకిస్థాన్‌కు చెందిన బెజవాడ కోడలి టాపిక్ ఎక్కువగా నడుస్తోంది. జియా బొడానిగా పేరు మార్చుకున్న ఆమె భారతదేశ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. త్వరలో ఆమెకు భారత పౌరసత్వం లభించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఆమె పాకిస్థాన్ పౌరురాలిగా ఉన్నప్పటికీ దీర్ఘకాలిక వీసాను కలిగి ఉండటం వల్ల ఆమెకు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రస్తుతం కుమార్తెతో కలిసి అమృత్‌సర్‌లో ఉన్న ఆమె భర్త పవన్ బొడాని, అత్తమామలు కలిశారు. వీరంతా త్వరలో విజయవాడకు రానున్నారు. రెండు దేశాలపై ఎంతో మమకారంతో ఉండే రజనీ.. పాకిస్థాన్‌లోని సింధ్ ప్రాంతంలో ఉన్న కియామరి ఫ్రెంచ్ బీచ్‌ను సందర్శించారు. సముద్రతీరంలో ఆమె దిగిన ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆమె ఇండియాకు తిరిగొచ్చి రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో షరీఫ్ దర్గాను సందర్శించారు. అనాసాగర్ సరస్సును కూడా వీక్షించారు.

ఘనంగా ఐసీఆర్ఏఐసీ 2 ఐటీ సదస్సు

విజయవాడ కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్స్, ఇంజనీరింగ్ విభాగం అధ్వర్యంలో ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆగిరిపల్లిలో జరిగిన అంతర్జాతీయ సదస్సు 'సమీప కాలానుగుణ కృత్రిమ మేధస్సు, గణితబద్ధమైన మేధస్సు, సమావేశపూరిత సాంకేతికతల అభివృద్ధి (ఐసీఆర్ఏఐసీ 2 ఐటీ)' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కంప్యూటర్ శాస్త్ర విభాగాధిపతి డి.సునీత ప్రారంభ ఉపన్యాసం చేశారు. చైర్మన్, డీన్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాల అధిపతి కేవీ సాంబశివరావు సదస్సు నివేదికను సమర్పించారు. మొత్తం 284 పరిశోధనా పత్రాలు అందగా, కఠినమైన ద్వంద్వ గోప్య సమీక్ష (డబుల్-బ్లైండ్‌పీర్-రివ్యూ) ప్రక్రియ అనంతరం 114 పత్రాలు ఎంపికయ్యాయి. ఈ పత్రాలు ప్రపంచస్థాయి స్కోపస్ సూచికలో వుండే టేలర్ అండ్ ఫ్రాన్సిస్ ప్రచురణల్లో వెలువడనున్నాయి. రైట్ స్టేట్ విశ్వవిద్యాలయం, కాలిఫోర్నియా స్టేట్ విశ్వవిద్యాలయం, ఇస్రో, అమృత విశ్వవిద్యాలయం, వీఐటీ, నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ, నెక్టార్ ఇన్ఫోటెక్ (అమెరికా), చండీగఢ్ విశ్వవిద్యాలయం, మహీంద్రా విశ్వవిద్యాలయం, ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్, అన్నా విశ్వవిద్యాలయం తదితర 122 ప్రతిష్టాత్మక విద్యా, పరిశోధనా సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ ఐటీ ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్ మాట్లాడుతూ, ఇలాంటి సదస్సులు అంతర్జాతీయ స్థాయిలో విద్యా, పరిశోధన సంబంధాలు పెంపొందించడంలో కీలకంగా పనిచేస్తాయన్నారు. ముఖ్యఅతిథి ఎలక్ట్రానిక్స్ అధినేత డాక్టర్ దాసరి రామకృష్ణ డిజిటల్ భవిష్యత్తును ఆవిష్కరించడంలో ఇంజినీరింగ్ పాత్రపై ప్రసంగించారు. అకడమిక్స్ డైరక్టర్ జి.సాంబశివరావు మాట్లాడుతూ, పరిశోధనలు కొత్త ఆవిష్కరణలతో పాటు వాటి సమాజానికి యదార్థ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలన్న అవసరాన్ని గుర్తు చేశారు. ఢిల్లీలోని అనుసంధాన్ జాతీయ పరిశోధన సంస్థ (ఏఎన్ఆర్ఎఫ్) నుంచి రూ.1,50,000 మంజూరు చేయడం ఈ సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, డి.కైలాసరావు, డి.సునీతలు పాల్గొన్నారు.

దశదిన కర్మకు వెళ్తుండగా దారుణం

(5వ పేజీ తరువాయి)

దంపతులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్ జంక్షన్‌లో ఇటీవల ఓ బంధువు చనిపోగా, శుక్రవారం జరిగిన దశదిన కర్మలో పాల్గొనేందుకు గుడ్లవల్లేరు మండలం చినగొన్నూరుకు చెందిన కోటప్రోలు రామాంజనేయులు (60), సీతామహాలక్ష్మి (55) శుక్రవారం ఉదయం టీవీఎస్ ఎక్సెల్‌పై బయల్దేరారు. జొన్నపాడు పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి వేగంగా వచ్చిన కారును వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఏఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

చినగొన్నూరులో విషాదచ్ఛాయలు

దంపతుల మృతితో చినగొన్నూరు గ్రామం శోకసంద్రమైంది. సామాన్య రైతు కుటుంబమైన వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెళ్లిళ్లై ఎవరి జీవితం వారు జీవిస్తున్నారు. ప్రమాద సమయంలో మృతురాలి సోదరి, భర్త అయిన కోటప్రోలు శివరామకృష్ణ, శివపార్వతి వెంటే ఉన్నారు. కళ్లెదుటే జరిగిన ప్రమాదాన్ని చూసి వారు తట్టుకోలేకపోతున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గ్రామానికి తీసుకురాగా, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470	

ఆదిశంకరాచార్యులకు అభిషేకం, అర్చన

విజయవాడ కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆదిశంక రాచార్యులు జయంతి సందర్భంగా అర్చకులు జీఆర్‌వీ సాగర్ ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన నిర్వహించారు. అనంతరం వేదపండితులను సత్కరించారు. మహిళలు లలితా సహస్ర నామ స్తోత్రాలను పఠించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు అధ్వర్యంలో ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్.భవానీ గిపాల్గొన్నారు.


లలితా సహస్రనామం పఠిస్తున్న భక్తులు

ఊరూవాడ కదిలింది

● అమరావతి రాజధాని 2.0కు వెళ్తున్న ప్రజలతో కిటకిటలాడిన బందరు రోడ్డు
● ప్రజలకు అవసరమైన ఆహారం, తాగునీరు అందించిన పార్టీ శ్రేణులు

అమరావతి ప్రధాని సభకు అనూహ్య స్పందన లభించింది. ఊరూవాడ నుంచి ప్రజలు ఉత్సాహంగా తరలివచ్చారు. ముఖ్యంగా బందరు రోడ్డు వాహనాలతో కిటకిటలాడింది.




కంకిపాడు నుంచి అమరావతి బయలుదేరిన కూటమి నాయకులతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. గన్నవరంలో.. హనుమాన్ జంక్షన్‌లో

పెనమలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి 2.0కు వెళుతున్న ప్రజల బస్సులతో బందరు రోడ్డు శుక్రవారం పసుపుమయమయింది. వందల కొద్దీ పాఠశాల బస్సులలో వేల కొద్దీ ప్రజలు తరలి వెళ్లడంతో బందరు రోడ్డు కిటకిటలాడింది. ఉదయం పది గంటలు మొదలుకొని ఒంటిగంట వరకు అభిమానులు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలతో బందరు రోడ్డు నిండిపోయింది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వాహనాల రద్దీతో బందరు రోడ్డు నిండుకుండగా మారింది. ఒక ప్రక్క స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తన బృందంతో ప్రయాణికుల అవసరాల మేరకు మంచినీరు, ఆహార సౌకర్యాలను పర్యవేక్షించగా, మండల వైద్యశాఖ ప్రయాణికులకు అవసరమైన వైద్యసేవలు అందు బాటులో ఉంచింది. పెనమలూరు పోలీసులు ఎక్కడా రద్దీ ఏర్పడకుండా, ట్రాఫిక్ జామ్ కాకుండా బందరు రోడ్డుపై పర్యవేక్షణ జరిపారు. పోరంకి ఆలపాటి గార్డెన్స్‌లో ఎమ్మెల్యే స్వయంగా ఆహార ప్యాకెట్లను తయారు చేసి వేలకొద్దీ ప్యాకెట్లను, మంచినీటి బాటిళ్లను బస్సులలోని ప్రయాణికులకు అందజేశారు.

నేను సైతం...అమరావతి కార్యక్రమానికి..

పోరంకికి చెందిన కడియాల రాధాకృష్ణారావు తన 96ఏళ్ల వయస్సును సైతం లెక్క చేయకుండా అమరావతి సభకు బస్సులో బయలు దేరాడు. పార్టీ స్థాపించిన 1982 తొలినాళ్లలో తాను ఎన్టీఆర్ వెంట ఉన్నానని..హైదరాబాద్ రామకృష్ణ థియేటర్‌లో తాను పార్టీ సభ్యత్వం తీసుకున్నానని గర్వంగా చెప్పాడు.

ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అమరావతి

కంకిపాడు : ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అమరావతి రాజధాని అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రాజధాని అమరావతి పునః నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని దావులూరు టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన బస్సులను,అల్పాహారాన్ని ఆయన స్వయంగా పాల్గొని కార్యకర్తలకు, కూటమి నాయకులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, దేశ ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో సుమా రు రూ. 60 వేల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, అనుమోలు ప్రభాకర్, కొలుసు గోవిందు, పావన మూర్తి, ఈడా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కంకిపాడు నుంచి రాజధాని అమరావతి పునఃనిర్మాణ సభకు భారీగా కూటమి నాయకులు బయలు దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామారావు, జనసేన పార్టీ జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, చలవాది రాజ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఈడుపుగల్లు నుంచి అమరావతి పునఃనిర్మాణానికి బయలుదేరిన ప్రత్యేక బస్సులను మాజీ ఎంపీపీ దేవినేని రాజా జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, గ్రామ టీడీపీ అధ్యక్షులు షేక్ షకార్ టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : అమరావతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాజధాని పనుల పునఃప్రారంభ వేడుక, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభకు ఉయ్యూరు నగర పంచాయతీ, మండల పరిధి గ్రామాల నుంచి కూటమి నాయకులు, ప్రజలు శుక్రవారం తరలి వెళ్లారు. ఉయ్యూరు 16వ వార్డు నుంచి వెళ్తున్న బస్సుకు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు జెం డా ఊపి ప్రారంభించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల నుంచి పార్టీ నాయకులు, ప్రజలు తరలివెళ్లగా వీరమ్మతల్లి ఆలయం వద్ద పార్టీ జిల్లా నాయకుడు చిన్మయ బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు ఆధ్వర్యంలో చినఓగిరాల, ఇతర గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు.

గన్నవరం : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రజల కలల రాజధాని నిర్మాణం అవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు వగ్రాణం హరిబాబు నాయుడు అన్నారు. రూ.58వేల కోట్లతో జరిగే అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తున్న ఘట్టంలో మనమందరం భాగస్వాములు కావటం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో అమరావతి రాజధానిలో జరిగే ప్రధాని మోదీ సభకు వెళుతున్న కూటమి నాయకుల బస్సులకు శుక్రవారం మండల పరిధిలోని చిన అవుటపల్లి బైపాస్ రోడ్డు దగ్గర జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, జాస్తి శ్రీధర్, మేడేపల్లి రమ, బోడపాటి రవి, పాలడుగు మల్లికార్జునరావు, రామినీడు బసవపూర్ణయ్య, సూరంపల్లి సర్పంచ్ ఈలప్రోలు వాసు, దేవరపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ప్రధాని మోదీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజధాని అమరావతిలో నిర్వహించిన అమ రావతి పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమానికి బాపులపాడు మండలం నుంచి భారీగా ప్రజలు ఉత్సాహంగా తరలి వెళ్లారు. బాపులపాడు మండలానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో 69 బస్సులను ఏర్పాటు చేశారు. కేటాయించిన బస్సుల్లో మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలివెళ్లారు. మహిళల నుంచి విశేషస్పందన కనిపించింది. ఇతర జిల్లాల నుంచి వచ్చే వారు విశ్రాంతి తీసుకోవడానికి జంక్షన్ లయన్స్‌క్లబ్‌లో వసతి ఏర్పాటు చేశారు. వసతి కేంద్రాన్ని బాపులపాడు డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్, ఆర్‌ఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. మండల కేంద్రం బాపులపాడు నుంచి సభకు వెళ్లే వాహనాలకు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు తదితరులు జెండా ఊపి సాగనంపారు.


కూటమి శ్రేణులతో కలిసి ర్యాలీని ప్రారంభిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : అమరావతిలో శుక్రవారం జరిగిన పునఃనిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో కూటమి శ్రేణులు, ప్రజలు, రైతులు భారీగా తరలివెళ్లారు. బస్సుల్లో వేలాదిగా తరలివెళ్తున్న ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎ.సీతారాంపురం వద్ద ఎంపీడీవో జోగేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే బస్సుల్లో వాటర్ బాటిల్స్, భోజనాలను అందజేశారు. డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, మొవ్వా వేణుగోపాల్, అక్కినేని కృష్ణాజీ, చల సాని శ్రీనివాస్, జాన్‌బాషా తదితర టీడీపీ నేతలు పర్యవేక్షించారు. పెదఅవుటపల్లి వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో టీడీపీ పరిశీలకుడు వగ్రాణం హరిబాబు నాయుడు, రాష్ట్ర కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, దయాల రాజేశ్వరరావు, తదితరులు ఆహారం అందజేశారు. కోడూరుపాడు, ఎ.సీతారాంపురం, తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కాలేజీ, అవుటపల్లి వద్ద పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎస్. ఎన్. పాలెం వద్ద నుంచి దెందులూరు నియోజకవర్గం నుంచి తరలివచ్చిన ప్రజానీకం, కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ర్యాలీగా తరలివెళ్లారు.


రంగన్నగూడెం నుంచి..

● చంద్రబాబునాయుడు దార్శనికతకు, అభివృద్ధికి నిదర్శనమైన అమరావతి రూపంలో నిర్మాణం జరగడం ఆంధ్రప్రదేశ్ అదృష్టమని ఎనెఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెం నుంచి సభకు బయలుదేరిన బస్సులకు సర్పంచ్ రంగామణి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, కూటమి నాయకులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కసుకుర్తి వెంకటశాస్త్రులు, రైతులు పాల్గొన్నారు. కె.సీతారాంపురం, వీరవల్లి, మల్లవల్లి, రేమల్లె, కానుమోలు, కాకులపాడు, మడిచర్ల తదితర గ్రామాల నుండి ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేసిన 73 బస్సుల్లో అమరావతికి పయనమయ్యారు.

విజయవాడ రూరల్ : అమరావతి పునర్నిర్మాణ సభకు విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల నుంచి కూటమి నేతలు భారీగా తరలి వెళ్లారు. నున్న, పాతపాడు, అంబాపురం, కొత్తూరు తాడేపల్లి, పి. నైనవరం గ్రామాల నుంచి బస్సులతో పాటు సొంత వాహనాల్లో టీడీపీ శ్రేణులు సభకు వెళ్లారు. వారిలో టీడీపీ నేతలు గొడ్డళ్ల చిన్నరామారావు, గంపా శ్రీనివాస్‌యాదవ్, మొండెం జమలయ్య తదితరులు ఉన్నారు.

ఉంగుటూరు : అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమానికి ఉంగుటూరు మండలం నుంచి కూటమి శ్రేణులు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. సుమారు 35కుపైగా ప్రైవేటు బస్సులు, 40పైగా కార్లలో సుమారు రెండు వేలమంది కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు. అమరావతికి బయలుదేరిన బస్సులను తేలప్రోలులో టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీడీవో ఈ.సత్యకుమార్ నేతృత్వంలో పంచాయతీ అధికారులు తేలప్రోలు, పొట్టిపాడు, ఆత్కూరు, పెదఅవుటపల్లి నుంచి బస్సుల్లో వస్తున్న ప్రయాణికులకు చిన అవుటపల్లి బైపాస్ ఫ్లైఓవర్‌బ్రిడ్జి కింద ఫుడ్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసి ఆహారం, వాటర్‌బాటిల్స్, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు, బిస్కట్లను పంపిణీ చేశారు.

వాహనాల మళ్లింపు

హనుమాన్‌జంక్షన్ / రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ అమరావతి పర్యటన సందర్భంగా శుక్రవారం జంక్షన్ సెంట ర్‌లో చెన్నై, హైదరా బాద్ వెళ్లే వాహనాలను పోలీస్ యంత్రాంగం దారి మళ్లించారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచి చెన్నై, హైదరా బాద్ వెళ్లే భారీ వాహనాలు, గూడ్స్ వాహనాలు విజయవాడ మీదుగా వెళ్లకుం డా జంక్షన్ సెంటర్‌లో దారి మళ్లించారు. చెన్నై వెళ్లే వాహనాలను గుడివాడ మీదుగా, హైదరా బాద్ వెళ్లే వాహనాలను నూజివీడు మీదుగా జంక్ష న్ సెంటర్, బొమ్ములూరు బైపాస్ వద్ద దారి మళ్లించారు.


బొమ్ములూరు వద్ద వాహనాలను మళ్లిస్తున్న ఎస్సై సురేష్, సిబ్బంది

● అమరావతి పునఃనిర్మాణ ప్రారంభానికి ప్రధాని మోదీ విచ్చేస్తున్న సందర్భంగా వాహన రాకపోకలను పోలీసులు బొమ్ములూరు వద్ద కట్టడి చేశారు. బొమ్ములూరు రామిలేరు వంతెన వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద హనుమాన్ జంక్షన్ ఎస్సై సురేష్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తూ సభకు వెళ్లే వాహనాలను బైపాస్ మీదుగా, భారీ వాహనాలను హనుమాన్‌జంక్షన్ మీదుగా మళ్లించారు.





నున్న నుంచి తరలివెళ్తున్న టీడీపీ నేతలు.. తేలప్రోలులో బస్సులకు జెండాఊపి ప్రారంభిస్తున్న ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి .. ఉయ్యూరు నుంచి.. ఆహార ప్యాకెట్లను స్వయంగా ప్యాకింగ్ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్


మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని

ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకోవాలి

హనుమాన్‌జంక్షన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకోవాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. టీడీపీ నాయకుడు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ యనమదల రమేశ్ తన జన్మదినం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు. గన్నవ రంలోని బీకెఆర్ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని చలసాని ప్రారంభించారు. టీడీపీ నాయకులు యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, గుమ్మడి శేషగిరిరావు, మైనేని శోభన్‌బాబు, లయన్స్ క్లబ్ నాయకులు తాడి రంగారావు, గంధం నారాయణ, సినీ నటుడు భగవాన్ పాల్గొన్నారు.

అమరావతి కార్యక్రమంలో అపశ్రుతి

వణుకూరుకు చెందిన సుశీల, విజయలకు తీవ్రగాయాలు

కంకిపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునః నిర్మాణ కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. పెనమలూరు మండలం వణుకూరుకు చెందిన సుశీల, విజయలకు తీవ్రగాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. అమరావతిలో శుక్రవారం జరిగిన ప్రధాని సభకు వణుకూరుకు చెందిన సుశీల, విజయ హాజరయ్యారు. సభ ముగించుకొని తిరుగు ప్రయాణంలో బస్సు ఎక్కేందుకు రోడ్డు క్రాస్ చేస్తోన్న సమయంలో మోటార్ సైకిల్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో సుశీల, విజయలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వణుకూరు టీడీపీ నాయకులు కొమ్మినేని శ్రీనివాస్, సుంకర రమేష్, పిడికిటి శ్రీనివాస్, వల్లే నరసింహరావులు గాయపడ్డవారిని మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్య పరీక్షలు అందించాలని సూచించారు.

సనాతన ధర్మం కోసం శంకరాచార్యులు విశేష కృషి

● బ్రాహ్మణ పరిషత్ మండల అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి

గన్నవరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మం కోసం శంకరాచార్యులు విశేష కృషి చేశారని బ్రాహ్మణ పరిషత్ మండల అధ్యక్షులు పన్యారం విష్ణుమూర్తి అన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురం కనక దుర్గమ్మ దేవస్థానంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ హిందూ ధర్మం నలుదిక్కుల వెలుగొందేటట్లు చేశార న్నారు. దేశంలోని శృంగేరి, ద్వారకా, పూరి, జ్యోతిర్మఠం అనే నాలుగు మఠాలను స్థాపించారని తెలిపారు. బ్రాహ్మణ పరిషత్ కార్యవర్గ సభ్యులు గోపరాజు సత్య పవన్‌కుమార్, మామిళ్లపల్లి వెంకట నాగ సుబ్బారావు, లక్ష్మణ శాస్త్రీ, యామర్తి వకుల, వెంకట శివనాగేశ్వరరావు, వెంకట ఆదిత్య, రాజశేఖర్, శ్రీవత్సవ, సాయిబాబా, కృష్ణమోహన్, రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.


శంకరాచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ పరిషత్ నాయకులు

ఈతకు దిగిన వ్యక్తి గల్లంతు

● కాకులపాడు మంచినీటి చెరువులో విషాదం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కాకులపాడు గ్రామం మధ్యలో ఉన్న మంచినీటి చెరువులో శుక్రవారం మధ్యాహ్నం ఈతకు దిగిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు గల్లంతైన ఘటన జరిగింది. హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ రైటర్ సుబ్బారావు, ఆర్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. కాకులపాడుకు చెందిన దూసరి సతీష్‌కుమార్, నూలు ఫ్రాన్సిస్‌లు మధ్యాహ్నం ఈత కోసం చెరువులో దిగారు. ఇటీవలే నీరు పెట్టడంతో చెరువు నిండుగా, లోతు ఎక్కువగా ఉండటంతో నూలు ఫ్రాన్సిస్ భయంతో బయటకు వచ్చేశాడని, దూసరి సతీష్‌కుమార్ (27) చెరువులో మునిగి గల్లంతయ్యాడని తెలిపారు. గల్లంతైన వ్యక్తికి కుమారుడు, భార్య ఉన్నారని, దినసరి వేతన వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తుంటాడని తెలిపారు. సతీష్‌కుమార్ కోసం పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.


చెరువులో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పెనమలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పోరంకి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సుమారు రూ. 11లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఉప్పలూరుకు చెందిన సామల శివాజీకి అరవై వేలు, ఈడుపుగల్లుకు చెందిన నాగోటు సీతమ్మకు మూడున్నర లక్షలు, ఉయ్యూరుక చెందిన మున్వర్‌బేగ్‌కు నాలుగు లక్షలు, కానూరుకు చెందిన గుడివాక వెంకట లింగారావుకు లక్ష, పోరంకికి చెందిన నాగమల్లేశ్వరి, రేవతిదేవి, నూతలపాటి రాణిలకు అరవై వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, అన్నే ధనయ్య, సూదిమళ్ల రవీంద్ర, కూనపరెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్





అమరావతి పునఃప్రారంభం సభా ప్రాంగణం వద్ద జనం కోలాహలం



ఆహ్వాన పత్రికలతో సభకు వస్తున్న మహిళా రైతులు



జాతీయ జెండాలు చూపుతున్న ప్రజలు

అమరావతికి తరలిన

అశేష జనం

- పశ్చిమ ఎన్టీఆర్ నుంచి భారీ సంఖ్యలో పయనం
- ఇబ్రహీంపట్నం రింగ్ వైపు నుంచి వెయ్యికి పైగా బస్సులు, 500 కార్లు, 2 వేలకు పైగా ద్విచక్రవాహనాల్లో తరలి వెళ్లిన ప్రజలు
- ఎక్కడికక్కడే ట్రాఫిక్ మళ్లింపు..

ఇబ్రహీంపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ సభకు శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా నుంచి బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో పెద్ద సంఖ్యలో జనం తరలివెళ్లారు. అందులో పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా నుంచి అశేషంగా తరలివెళ్లారు. పోలీసుల అంచనా ప్రకారం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి వెయ్యికి పైగా బస్సులు(ప్రభుత్వ ప్రైవేటు), 500 కార్లు, 2వేల వరకు ద్విచక్రవాహనాలు అమరావతికి వెళ్లాయి. ఇన్ని వాహనాల రోడ్డు మీదకు వచ్చినా ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు జాగ్రత్తలు వహించారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే లారీను ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద నుంచి మైలవరం వైపు మళ్లించారు. అక్కడి నుంచి నూజివీడు, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు వైపునకు మళ్లించారు. విజయవాడ వైపు వెళ్లాల్సిన 30 లారీలను ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద నిలుపుదల చేశారు. తొలిసారి ట్రక్ టెర్మినల్‌ను ఈసభ ద్వారా వినియోగంలోకి తెచ్చినట్లు పోలీసులు తెలిపారు. అమరావతికి కాకుండా వెళ్లే ద్విచక్రవాహనాలు, కార్లను నేరుగా విజయవాడ వైపు పంపారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాలేదు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తిరువూరు, రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల నుంచి బస్సుల్లో తరలివెళ్లే వారికి ఉదయం, సభ అనంతరం కూడా భోజనం ప్యాకెట్లు అందించేందుకు కొండపల్లి ఐడీఏలో వంట చేయించారు. ప్యాకెట్లను సిద్ధం చేసి ఉదయాన్నే వాటిని కొండపల్లి హెచ్‌పీ కంపెనీ ఎదుట ఉంచి ఎండీయూ వాహనాల్లో ఎక్కించి గుంటుపల్లిలోని సీఏ కన్వెన్షన్ హాల్ వద్దకు చేర్పించారు. సభ ముగిశాక కూడా వారికి తిరిగి ఆహార పొట్లాలు అందించేందుకు వంట చేయించారు. పలు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. మందులు అందుబాటులో ఉంచారు. వెస్ట్ బైపాస్ కింద కూడా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. బైపాస్ ప్రధాన ద్వారం వద్ద మజ్జిగ, వాటర్ బాటిల్స్ నేరుగా బస్సుల్లోకి పంపిణీ చేశారు.



గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ వద్ద కార్లు, బస్సుల్లో తరలివెళుతున్న మహిళలు



కొండపల్లి ఐలా కార్యాలయంలో వంటలు



వెస్ట్ బైపాస్‌పై ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

చింతమనేని ఆత్మీయ ఆతిథ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అమరావతిలో ప్రధాని సభకు తరలివెళుతున్న కూటమి శ్రేణులు, ప్రజలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ఆత్మీయ ఆతిథ్యాన్ని అందజేశారు. బాపులపాడు మండలం ఎస్.ఎన్.పాలెం వద్ద జాతీయ రహదారిపై నియోజకవర్గం నుంచి బస్సుల్లో పెద్దఎత్తున తరలివస్తున్న ప్రజలకు అభినందనలు తెలిపారు. వారికి భోజన ఏర్పాట్లు చేశారు. గన్నవరం ఎస్.ఎం. కన్వెన్షన్‌లో సుమారు 5వేల మందికి పైగా విందు భోజనం పెట్టించారు. మటన్ ధమ్‌బిర్యానీ, కట్టా, పెరుగుపచ్చడి, కిళ్లీ, కూల్‌డ్రింక్, మినరల్ వాటర్ బాటిల్ అందిస్తూ స్వయంగా వడ్డించారు. నాన్‌వెజ్ తినని వారికి ప్రత్యేకంగా పప్పు, సాంబారు, వంకాయబఠానీ కూరలతో, మామిడికాయ పచ్చడితో భోజనాలు పెట్టి, కూల్‌డ్రింక్ అందజేశారు.



కార్యకర్తకు భోజనం వడ్డిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

శభాష్.. టీమ్ ఎన్టీఆర్

- సమష్టి కృషితో అమరావతి పునఃప్రారంభం కార్యక్రమం విజయవంతం
- మండల, జిల్లాస్థాయి నోడల్ అధికారులకు అభినందనలు: కలెక్టర్ లక్ష్మీశ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్ర చరిత్రలో కీలక ఘట్టమైన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో టీమ్ ఎన్టీఆర్ చేసిన కృషి ప్రశంసనీయమని, కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఆయన మాట్లాడారు. ఎంఐపీ, వీవీఐపీ, వీఐపీ తదితరులకు విజయవాడలో వసతి, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం, విజయవాడకు వచ్చిన బస్సులు ఏయే మార్గాల్లో వెళ్లాల్లో సరైన విధంగా దిశానిర్దేశం చేయడంతో పాటు విశాఖపట్నం, మన్యం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజనం, తాగునీరు అందిచామన్నారు. ప్రతి బస్సు పార్కింగ్ ఎక్కడ చేయాలనేది స్పష్టంగా సూచనలిచ్చామన్నారు. పార్కింగ్ కోసమే 350 ఎకరాలు కేటాయించినట్టు లక్ష్మీశ తెలిపారు. వెస్టర్న్ బైపాస్, సర్వీసు రోడ్లను కూడా ఉపయోగించుకున్నట్లు తెలిపారు. ఎక్కడా భోజనం, తాగు నీటికి కొరత అనే మాట లేకుండా చూశామన్నారు. కార్యక్రమం అనంతరం దూరప్రాంతాలకు తిరిగివెళ్తున్న వారికి రాత్రి భోజనం కూడా అందించినట్లు తెలిపారు. మండలాల నుంచి బయలుదేరుతున్న బస్సుల వద్దకే టిఫిన్లు, భోజనాలను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయి నోడల్ అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు కార్యక్రమంలో కీలక భాగస్వాములై సేవలందించారని.. వారందరికీ అభినందనలు అని ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి అధికారులు, మంత్రుల సహకారంతో పకడ్బందీ ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సమీక్షిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



వాటర్ బాటిల్స్ బస్సుల్లోకి అందిస్తున్న సిబ్బంది

భేషుగ్గా ఏర్పాట్లు

జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో వచ్చిన వారు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా నగరంలో ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసిన ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, తాగునీరు వంటి వాటిని ఏర్పాటు చేశారు. కలెక్టర్ లక్ష్మీశ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి నిరంతరం పరిస్థితిని సమీక్షించడంతో పాటు క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటనలు చేశారు.

గృహనిర్మాణ శాఖలో అవినీతిపై చర్యలకు రంగం సిద్ధం

- చల్లపల్లి మండలంలో రూ.33 లక్షల అవినీతి
- డీఈ, ఏఈ, ఎంఐసీలను బాధ్యులను చేసి, వారి నుంచి రికవరీ చేయాలని నిర్ణయం
- కేసులు నమోదు చేసే అవకాశం?

(ఆంధ్రజ్యోతి-చల్లపల్లి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణ శాఖలో అవకతవకలు జరిగినా చర్యలు శూన్యం. లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన సిమెంటును అధికారులే విక్రయించేయటం, అధికారులే కాంట్రాక్టర్ అవతారమెత్తి లబ్ధిదారుల నెత్తిన కుచ్చుటోపీలు పెట్టడం వంటి ఉదంతాలు ఎన్నో వెలుగుచూశాయి. చల్లపల్లి మండలంలో గృహనిర్మాణ శాఖ గోడౌన్‌లో నిల్వ ఉండాల్సిన సిమెంటు, ఐరన్ మాయమయ్యాయంటూ గతంలో ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే. హౌసింగ్ డివిజన్ స్థాయి అధికారి కాంట్రాక్టర్‌గా మారి లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేసి ఇళ్లను మధ్యలోనే వదిలేయటం, తాను కట్టించే ఇళ్లను పూర్తిచేసేందుకు నిబంధనలకు విరుద్ధంగా అదనపు స్టాక్‌ను ఇష్టారాజ్యంగా తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. స్టాకు పాయింట్‌నిల్వల్లో అవకతకవలు జరగటంతో మండల స్థాయి అధికారుల బదిలీల సమయంలో రికార్డులు సైతం అప్పగించలేదు. గృహనిర్మాణశాఖలో నాడు జరిగిన అవినీతి, అక్రమాలపై గత ప్రభుత్వంలోనే అధికారులు విచారణ చేపట్టినప్పటికీ గోప్యంగా వ్యవహరించి, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎట్టకేలకు అధికారుల్లో చలనం వచ్చింది. స్టాక్ నిల్వల్లో తేడాలున్నచోట ఎంతమేరకు అవినీతి జరిగిందో ఓ నిర్ధారణకు వచ్చి చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. మండలంలో రూ.33లక్షల మేర అవకతవకలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు కాంట్రాక్టరు అవతారమెత్తిన డివిజన్ స్థాయి అధికారి, ఏఈ, ఇద్దరు ఎంఐసీలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అవకతవకలకు నలుగురినీ సమాన బాధ్యులను చేస్తూ నలుగురి నుంచీ రివకరీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. డీఈ ఇప్పటికే పదవీవిరమణ చేయటంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్‌ను నిలుపుదల చేయటం, మిగిలిన ఉద్యోగులపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తారని తెలుస్తోంది. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచీ గృహనిర్మాణశాఖకు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

చెరువులో ఈతకు దిగిన యువకుడు గల్లంతు

హనుమాన్ జంక్షన్‌రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): కాకులపాడు గ్రామం మధ్యలో ఉన్న మంచినీటి చెరువులో శుక్రవారం మధ్యాహ్నం ఈతకు దిగిన ఇద్దరిలో ఒక యువకుడు గల్లంతయ్యాడు. హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ రైటర్ సుబ్బారావు, ఆర్ఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం... కాకులపాడు గ్రామానికి చెందిన దూసరి సతీష్‌కుమార్, నూలు ఫ్రాన్సిస్ మధ్యాహ్నం ఈత కొట్టడానికి చెరువులో దిగారు. ఇటీవలే నీరు పెట్టడంతో చెరువు నిండుగా ఉంది. లోతు ఎక్కువగా ఉండటంతో నూలు ఫ్రాన్సిస్ భయంతో బయటకు వచ్చేశాడు. దూసరి సతీష్‌కుమార్(27) చెరువులో మునిగి పోయాడు. గల్లంతయిన అతని కోసం పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో అగ్నిమాపక సిబ్బంది రాత్రి వరకూ గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో తాత్కాలికంగా విరామం ప్రకటించి శనివారం ఉదయమే గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.



కాకులపాడు చెరువులో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది







ఇండిజెనాస్ రాడార్స్, క్షిపణి ప్రయోగం ఊహాచిత్రాలు, వర్చువల్ శంకుస్థాపనను గుల్లలమోదలో తిలకిస్తున్న కల్నల్, ఆర్డీవో స్వాతి తదితరులు

రక్షణ రంగ ఆకాంక్షలు సాకారం

రూ.1500 కోట్ల అంచనాలతో నాగాయలంక నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ పనులు ప్రారంభం

అవనిగడ్డ, మే 2(ఆంధ్రజ్యోతి): గుల్లలమోదలో డీఆర్డీవో నిర్మించనున్న మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ దేశ రక్షణ రంగ ఆకాంక్షలను సాకారం చేసే ప్రాజెక్టు అవుతుందని దివి ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రూ.1500 కోట్ల అంచనాలతో ప్రధాని నరేంద్ర మోదీ మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ పనులను అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేంద్రానికి నాగాయలంక నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్‌గా నామకరణం చేస్తూ రక్షణ రంగానికి ఈ కేంద్రం దుర్గామాత నవశక్తినిచ్చే కేంద్రంగా అభివర్ణించారు.

ఏడాదిలోపే తొలి పరీక్ష?

గుల్లలమోదలో నిర్మిస్తున్న మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ నిర్మాణ పనులు ఆరేడు సంవత్సరాలపాటు జరుగుతాయని, ఇందుకోసం దాదాపుగా రూ.25 వేల కోట్లకుపైగా వెచ్చించనున్నారని సమాచారం. అయితే భారత రక్షణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాబోయే సంవత్సరం లోపే ఇక్కడి నుంచి క్షిపణి పరీక్షలను నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయబోతున్నారని తెలియవస్తోంది. ఇప్పటికిప్పుడు మిస్సైల్ టెస్టింగ్ నిర్వహణకు కావాల్సిన పర్మినెంట్ రాడార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయటం కష్టమే అయినప్పటికీ బెల్‌తో డీఆర్డీవో నిర్మించిన ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్‌ను ఉపయోగించి కూడా స్వల్ప శ్రేణి క్షిపణులను ప్రయోగించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేయనున్నారని తెలుస్తోంది.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం

నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమవనుంది. 5 వేల కిలోమీటర్లకు పైబడిన లక్ష్యాలను ఛేదించే మిస్సైల్‌ను ప్రయోగించేందుకు ఈ కేంద్రాన్ని వేదికగా చేసుకోవచ్చుని డీఆర్డీవో భావిస్తోంది. దీని కోసం అత్యాధునిక ఈవో(ఎలక్ట్రో ఆప్టికల్ సిస్టమ్)ను ఈ కేంద్రంలో వినియోగించనున్నట్లుగా తెలుస్తోంది.

ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్

ఇక్కడ అత్యాధునిక ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్ కూడా ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ పార్టనర్‌షిప్‌తో డీఆర్డీవో ఇండిజెనాస్ రాడార్ సిస్టమ్‌ను వినియోగిస్తూ ఇంద్ర, అశ్విని, స్వాతి, షోర్డ్‌షిప్ వంటి ఆధునిక రాడర్లను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురాగా, వీటిని నాగాయలంకలో ఏర్పాటు చేయబోయే మిస్సైల్ టెస్టింగ్ రేంజ్‌లో పూర్తిస్థాయిలో ఉపయోగించనున్నట్లు సమాచారం. వీటి ద్వారా భూమికి సమీపం నుండి వెళ్లే మిస్సైల్‌లు, హెలికాప్టర్లను గుర్తించే వెసులుబాటు ఉంటుంది.

దీర్ఘశ్రేణి క్షిపణులను పరీక్షించే వెసులుబాటు

నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ ద్వారా దీర్ఘశ్రేణి క్షిపణులు సైతం పరీక్షించే వెసులుబాటు ఉంటుంది. ఇంతకాలం హైదరాబాద్‌లోని డీఆర్డీవో తయారు చేసే క్షిపణులను ఒడిశాలోని బాలసోర్ నుంచి పరీక్షిస్తుండగా, హైదరాబాద్ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి బాలసోర్‌కు చేరుకునేందుకు ఎక్కువ సమయం పడుతుండటం, పరీక్ష చేయాల్సిన క్షిపణుల రక్షణకు కూడా ప్రమాదం పొంచి ఉండటంతో దీర్ఘశ్రేణి క్షిపణులను తరలించేందుకు డీఆర్డీవో ఇబ్బందులు పడుతూ వచ్చింది. నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్ దూరం బాలసోర్‌కు వెళ్లే దూరం సగానికి సగం కంటే తక్కువగా ఉండటం, ఇక్కడకు దీర్ఘ శ్రేణి క్షిపణులను తరలించేందుకు కావాల్సిన మౌలిక వసతులు ఇప్పటికే దాదాపుగా కలిగి ఉండటంతో ఈ కేంద్రం నుంచి 5 వేల కిలోమీటర్లు, అంతకు మించి వెళ్లే క్షిపణులను పరీక్షించే అవకాశం ఉంది.



ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ప్రధాని నరేంద్రమోదీకి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కృతజ్ఞతలు

అమరావతిలో సభా వేదిక మీదకు వచ్చే ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కలిశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో మిస్సైల్ టెస్టింగ్‌రేంజ్ ఏర్పాటుపై మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గుల్లలమోద వచ్చిన డీఆర్డీవో చైర్మన్ సమీర్ వి.కామత్

నాగాయలంక/అవనిగడ్డ: గుల్లలమోదలోని క్షిపణి ప్రయోగ కేంద్రాన్ని ఉదయం 7 గంటలకు డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ సందర్శించి ప్రారంభ ఏర్పాట్లను ప్రాజెక్టు మేనేజర్ కల్నల్ సమీర్ శర్మతో చర్చించి అనంతరం అమరావతి వెళ్లారు. డీఆర్డీవో డైరెక్టర్ చౌబేతోపాటు 20 మంది అధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రాజెక్టు డైరెక్టర్ సమీర్ శర్మతో ఇక్కడి పనులను వేగవంతంగా చేయాలని ప్రత్యేకంగా టెస్ట్ రేంజ్ నిర్మాణ పనులపై దృష్టి పెట్టాలని సమీర్ వి.కామత్ సూచించినట్లు సమాచారం. వర్చువల్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు గ్రామానికి చెందిన 200 మందిని ప్రత్యేక అనుమతులతో ఆహ్వానించారు. ఆర్డీ వో కె.స్వాతి, జిల్లా అధికారి పి.సాయిబాబు, తహసీల్దార్ ఎం.హరనాథ్ హాజరయ్యారు.

కాంగ్రెస్ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గం

మచిలీపట్నం టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గాన్ని డీసీసీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ శుక్రవారం ప్రకటించారు. పీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ వివరాలను ఆయన వెల్లడించారు. 34 మందితో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గంలో అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా కోకా ఫణిభూషణ్, ఉపాధ్యక్షులుగా కిలారు వెంకటరత్నం, తాడిశెట్టి సాంబశివరావు, కొడాలి బసవమ్మ, బీమా శ్రీనివాసరావు, ఆది రామ్మోహనరావు, గొల్లా వెంకటసుబ్బారావు, పి.సాగర్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా పదిమంది, కార్యదర్శులుగా పదిమంది, జాయింట్ సెక్రటరీలుగా ఆరుగురిని నియమించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాబీ, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శొంఠి నాగరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, మచిలీపట్నం కాంగ్రెస్ కో ఆర్డినేటర్ అబ్దుల్ మతీన్, ఎం.శామ్యూల్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో జీఎం తనిఖీలు

రైల్వేస్టేషన్, మే 2(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్, శివారు ప్రాంతాల రైల్వేస్టేషన్లను విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్‌తో కలిసి తనిఖీలు చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లోని ఆరో నెంబరు ప్లాట్‌ఫాం నుంచి తనిఖీలను ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా అంశాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, మంచినీటి వనరుల పనితీరు పరిశీలించారు. క్రూ లాబీని తనిఖీ చేసి అక్కడ లోకో పైలట్లు, సిబ్బందితో సంభాషించారు. రోజువారీ కార్యకలాపాల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను, అడ్డంకులను తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్లాట్‌ఫాం నెంబర్ 1లో కూడా ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. తనిఖీ సమయంలో రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సంత్రాగచి-మంగళూరు ఎక్స్‌ప్రెస్(నెం22851) ఆన్‌బోర్డు హౌసింగ్ కీపింగ్ సర్వీసు శుభ్రత, రేక్ నిర్వహణను ఆయన పరిశీలించారు. వేసవిలో ప్రయాణికులకు నీరు, మజ్జిగ పంపిణీ చేయటానికి ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన సమ్మర్ కియోస్క్ పనితీరును పరిశీలించారు. తర్వాత గుణదల రైల్వేస్టేషన్‌లో రూ.24.37 కోట్ల వ్యయంతో నిర్వహిస్తున్న అమృత్‌భారత్ స్టేషన్ పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. 12 మీటర్ల ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫాం ఉపరితలం మెరుగుదల, అదనపు కవర్ ఓవర్ ప్లాట్‌ఫాం, రెండు లిఫ్టుల ఏర్పాటు, వెయిటింగ్ హాల్, ముందు భాగంలోని భవనం, సర్క్యులేటింగ్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు.



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న పురస్కారాలకు దరఖాస్తులు

గవర్నర్‌పేట, మే 2(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న జాతీయస్థాయి పురస్కారాలు-2025కు ఎంపిక చేసేందుకు వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తూ ప్రతిభ కనబరుస్తున్న వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజసేవ, పర్యావరణ పరిరక్షణ, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటకరంగం, టీవీ, సినీ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు వారి సేవల గుర్తింపు సర్టిఫికెట్లు, పేపర్ కటింగ్, ఫొటోలు, జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జతచేసి ఈనెల 15వ తేదీ లోపు కార్యాలయానికి చేరేలా చూడాలని కోరారు. మే 25న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కార గ్రహీతలను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 96523 47207కు ఫోన్ చేయాలని సూచించారు.

ఘనంగా చందనోత్సవ వేడుకలు

గుడివాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగవరప్పాడులో వేంచేసి యున్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చందనోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అమ్మవారు చందన అలంకారంలో దర్శనమిచ్చారు. లోకకల్యాణార్థం చందనోత్సవ పూజలు చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశ్యంతో దేవస్థానంలో చందన వేడుకలు నిర్వహించినట్టు వేదపండితులు కోమాండూరి ఫణీంద్ర ఆచార్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాగంటి వెంకట కృష్ణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.



చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

మూడ్రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : లింగవరం(గుడివాడ) సబ్ స్టేషన్‌లో 220 కేవీ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 3వ తేదీ నుంచి 6వతేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదపారుపూడి, తమ్మలంపాడు గ్రామాల్లో ఈ మూడ్రోజులు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. గృహ, వాణిజ్య వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



అన్నదాన ఏర్పాట్లను పరిశీలిస్తున్న విశ్రాంత ఎయిర్‌ఫోర్సు ఉన్నతాధికారి వెంకటేశ్వరరావు

ఘనంగా శ్రీరామసాయి ఆలయ వార్షికోత్సవం

పామర్రు, మే 2 (ఆంధ్రజ్యోతి): పెదమద్దాలిలో శ్రీరామ సాయి మందిరం 18 వార్షికోత్సవాన్ని ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి విశేష అలంకరణలతో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎయిర్‌ఫోర్సు ఉన్నతాధికారి వీవీ రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గేదెలకోడు వంతెన

● ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలో ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - కూచిపూడి): చినముత్తేవి వద్ద నిర్మించిన గేదెలకోడు వంతెన ప్రమాదకర స్థితికి చేరింది. దీంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. కూచిపూడి నుంచి మచిలీపట్నం వెళ్లే ప్రధాన రహదారి చిన్నముత్తేవిలో సుమారు 100 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వంతెనకిరువైపులా ఉన్న రెయిలింగ్ విరిగిపోవటంతోపాటు శ్లాబు దెబ్బతింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవ్వాల్సి వస్తోందనని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం వెళ్లేందుకు ఈ ప్రాంత వాసులకు ఇదే ప్రధాన రహదారి కావటంతో దీనికి ప్రాముఖ్యత ఉంది. ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు అనేక పర్యాయాలు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయిందని విమర్శలు వినవస్తున్నాయి. వంతెనకు రెండు వైపులా రెయిలింగ్ లేకపోవటంతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనదారులు రాకపోకల సమయాల్లో డ్రెయిన్‌లో పడిపోయి, గాయాలపాలైన సందర్భాలు అనేకమున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంచనాలు రూపొందించాం

చినముత్తేవిలోని ఐనంపూడి డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన, కాజలోని ఐనంపూడి డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనతోపాటు గేదెలకోడు డ్రెయిన్‌పై శిథిలావస్థకు చేరిన వంతెన నిర్మాణాలకు ఇప్పటికే అంచనాలు రూపొందించాం. నిధులు విడుదలైన వెంటనే నిర్మాణ పనులు చేపడతాం

సురేష్,ఆర్‌అండ్‌బీ జేఈ



వంతెనపై విరిగిపోయిన రెయిలింగ్



ప్రమాదకర స్థితికి చేరిన వంతెన

టీడీపీ కార్యకర్త మృతి

గుడివాడ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : తాటికాయలు కోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి టీడీపీ కార్యకర్త మహ్మద్ హుస్సేన్(35) మృతిచెందాడు. హుసేన్ భార్య ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి కాగా, 20 నెలల బాబు ఉన్నాడు. తల్లి చనిపోయి ఏడాది గడవకముందే కుమారుడు మృతి చెందటంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. చౌటపల్లి శివారు కొత్త మల్లాయిపాలేనికి చెందిన తాపీ మేస్త్రీ మహ్మద్ హుస్సేన్ (ఖాజా) గురువారం సాయంత్రం తాటికాయల నిమిత్తం చౌటపల్లి శివారులోని తాటిచెట్టు ఎక్కాడు. ఈ నేపథ్యంలో చేతులు పట్టుతప్పడంతో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుడివాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ కామినేని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే హుస్సేన్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చంటిబాబు తెలిపారు. హుస్సేన్ మృతదేహానికి పలువురు కూటమి నాయకులు నివాళులర్పించారు. టీడీపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడని, తల్లి మరణించి ఏడాది గడవకముందే హుస్సేన్ మృతి చెందటం బాధాకరమని సహచరుడు షేక్ నూర్ కన్నీటి పర్యంతమయ్యాడు. టీడీపీ కార్యకర్త హుస్సేన్ ఆకస్మిక మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, సంతాపం తెలిపారు.



మహ్మద్ హుస్సేన్

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

● డీఎస్సీ రాష్ట్ర ఫోరం కన్వీనర్ కె.ఎల్ శ్రీనాథ్

గుడివాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్‌ను విధానాన్ని అమల్జేయాలని 2003 డీఎస్సీ రాష్ట్ర ఫోరం కన్వీనర్ కె.ఎల్ శ్రీనాథ్ డిమాండ్ చేశారు. స్థానిక పోస్టాఫీసు వద్ద శుక్రవారం పోస్టుకార్డు క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ ఒకటో తేదీ 2004కు ముందు విడుదల చేసిన నోటిఫికేషన్ల ద్వారా నియమించబడిన సుమారు 11వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 అనుసరించి తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమల్జేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరీలకు పోస్టుకార్డులను పంపించినట్టు ఆయన తెలిపారు. బెనర్జీ, జయరాజు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టు కార్డు క్యాంపెయిన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మహిళలకు నడక పోటీలు

గుడివాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ వాకర్స్ దినోత్సవం సందర్భంగా తారకరామా వాకర్స్ క్లబ్, తెలుగు మహిళ వాకర్స్ క్లబ్, రాజేంద్రనగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో రావి శోభనాద్రి చౌదరి పార్కులో శుక్రవారం మహిళల(50-60సంవత్సరాల)కు నడక పోటీలను నిర్వహించారు. ఎం. ప్రియాంక, ఎస్.మంజులదేవి, కె.బిందుమాధవిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. నందమూరి పద్మజ కన్సోలేషన్ బహుమతి సాధించింది. విజేతలకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బ్రహ్మయ్య, సుధారాణి, లక్ష్మీలు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం గంగాధరరావు, సీతారామస్వామి, తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికలు అందుకున్న విజేతలు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి నాగపడగ సమర్పణ

మోపిదేవి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గుంటూరు జిల్లా యాదవపాలేనికి చెందిన డొక్కు శివసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు వెండి నాగపడగను సమర్పించారు. కుటుంబ సభ్యులతో శుక్రవారం ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. 525 గ్రాముల బరువు కలిగిన సుమారు రూ.65 వేలు విలువతో తయారు చేసిన నాగపడగను ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావుకు అందజేశారు.



వెండి నాగ పడగను అందిస్తున్న దాతలు

మోదీ సభకు భారీగా తరలిన ప్రజలు

● బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ● అమరావతికి తరలిన కూటమి నేతలు, కార్యకర్తలు



గుడివాడలో బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



మొవ్వ నుంచి అమరావతికి తరలివెళ్తున్న ప్రజలు



దొండపాడులో బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీసీ చైర్మన్ కుటుంబరావు



గుడ్లవల్లేరులో బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న పొట్లూరి రవికుమార్

గుడివాడ , మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాని మోదీ పర్యటన, బహిరంగ సభకు గుడివాడ నియోజకవర్గం నుంచి కూటమి శ్రేణులు, మహిళలు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. శుక్రవారం రామనపూడి వద్ద బస్సులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కూటమి నాయకులు, ప్రజలతో కలిసి బస్సులో ఆయన ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ అమరావతి పునఃనిర్మాణ పనులు ప్రారంభం కావడం రాష్ట్రానికి శుభ సూచకమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు రాంబాబు, మురళీ, రవి, జగన్మోహనరావు పాల్గొన్నారు.

పామర్రు : ప్రజా రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రజలు, కూటమి శ్రేణులు స్వచ్ఛందంగా తరలిరావడం ఎంతో శుభ పరిణామమని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో అమరావతికి తరలి వెళ్తున్న ప్రత్యేక బస్సులను ఆయన శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు నుంచి 35 ప్రత్యేక బస్సులతోపాటు పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన మరికొన్ని ప్రత్యేక వాహనాల్లో గ్రామాల్లోని ప్రజలు, డ్వాక్రా సంఘాల మహిళలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, దాలిపర్తి ప్రసాద్, చాట్ల రమేష్, జన్నుశోభన్‌బాబు, వెలుగు మండల సమైక్య అధ్యక్షురాలు కడలి వరలక్ష్మీ, ఏపీఎం తిరుపతిరావు, ఎంపీడీవో కె.జ్యోతి, పోనుగంటి సందీప్, మంతెన రామాంజనేయులు ఇతర కూటమి నేతలు పాల్గొన్నారు. బస్సుల్లో తరలి వెళ్లే మహిళలకు ప్రత్యేకంగా తయారు చేసిన అల్పాహారం, మజ్జిగ, వాటర్‌ను బస్సులోనే గ్రామాల వారీగా ఏర్పాటు చేశారు.

కూచిపూడి : అమరావతి రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనటానికి విచ్చేసిన ప్రధాని మోదీ సభకు మొవ్వ మండల ప్రజానీకం తరలివెళ్లారు. మండలంలోని 21 గ్రామపంచాయతీల నుంచి పది బస్సుల్లో ప్రజలు ఉత్సాహంగా వెళ్లారు. మహిళలు, వృద్ధులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొనటం విశేషం. ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలు, కూటమి నేతలు, కార్యకర్తలు అమరావతి తరలివెళ్లిన వారిలో ఉన్నారు.



అమరావతి వెళ్లటానికి రామన్నపూడి వద్ద బారులు తీరిన ఆర్టీసీ బస్సులు

గుడివాడ రూరల్ : అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాని మోదీ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, మహిళలు 25 బస్సుల్లో తరలివెళ్లారు. ఎంపీడీవో డివై.విష్ణు ప్రసాద్ ఆధ్వర్యంలో శేరిగొల్వేపల్లి డీసీ చైర్మన్ నూతక్కి కుటుంబరావు శుక్రవారం జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. దొండపాడు, చౌటపల్లి, మోటూరు, బొమ్ములూరు, బిళ్లపాడు, వలివర్తిపాడు, లింగవరం తదితర మేజర్ గ్రామపంచాయతీల నుంచి వేలాది మంది ప్రజలు ఉదయం నుంచే ఆర్టీసీ బస్సులు, కార్లలో ఉమ్మడి పార్టీల జెండాలు కట్టుకుని భారీగా తరలివెళ్లారు.

నందివాడ : రాజధాని అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన చేసేందుకు వస్తున్న ప్రధాని మోదీ సభకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు మేరకు భారీగా ప్రజలు తరలి వెళ్లారు. నందివాడ మండలంలోని రుద్రపాక, పోలుకొండ, అనుమనపూడి, తమిరిశ, ఇలపర్రు, కుదరపల్లి, తుమ్మలపల్లి, నందివాడ, జనార్ధనపురం, పెదలింగాల పలు గ్రామాల నుంచి సుమారు 25 బస్సులు 60 కారులలో అమరావతి మోదీ సభకు తరలివెళ్లినట్టు గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి తెలిపారు. మండల టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి : అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి శుక్రవారం పెదపారుపూడి మండలం నుంచి అత్యంత ఉత్సాహంగా ప్రజలు తరలివెళ్లారని ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి వంగా శ్రీనివాస్ తెలిపారు. వెంట్రప్రగడ బస్టాండ్ నుంచి అమరావతికి వెళ్లే 10 బస్సులను ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ అమరావతి పునర్నిర్మాణ ప్రారంభోత్సవ సభకు నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, ఏపీఎం మహంకాళిరావు, ఉపాధి హామీ పథకం టీఏ రంగారావు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు నుంచి అమరావతికి బయలుదేరిన బస్సులు

పమిడిముక్కల : అమరావతిలో రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభం సందర్భంగా శుక్రవారం జరిగిన ప్రధాన మంత్రి బహిరంగ సభకు పమిడిముక్కల మండల గ్రామాల నుంచి కూటమి నాయకులు, టీ డీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో బస్సులలో తరలివెళ్లారు. హనుమంతపురంలో టీడీపీ నాయకుడు లింగమనేని బాబూరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు బొల్లా మల్లిఖార్జున, ఎం. శివ నాగరాజు, సీహెచ్ రాఘవులు ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు తరలివెళ్లారు. లంకపల్లి, పమిడిముక్కల, కపిలేశ్వరపురం, మంటాడ, కృష్ణాపురం తదితర గ్రామాల ప్రజలు బస్సులలో ఆంధ్రుల రాజధాని అమరావతికి జై అంటూ నినాదాలు చేశారు.

గుడ్లవల్లేరు : అమరావతికి రాజధాని పునర్నిర్మాణ ప్రారంభోత్సవ సభకు గుడ్లవల్లేరు మండలం నుంచి ప్రజలు భారీగా తరలి వెళ్లారు. మండలం నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 30 బస్సులలో 1500 మంది , వ్యక్తిగతంగా మోటార్ బైక్‌లు, కార్లలో 500 మంది వరకూ అమరావతిలోని ప్రధాని మోదీ సభకు తరలివెళ్లారు. గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి అన్ని బస్సులను గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్ కుమార్, జనసేన నాయకుడు చిలంకుర్తి వెంకటేష్, టీడీపీ నాయకులు అట్లూరి రామ్మోహనరావు (చంద్రాల చిట్టిబాబు), జంగం మోహనరావు, కె.నవాబు, రంగబాబు, పోలవరపు వెంకటరావు, జాని, నరసింహారావు, మల్లిఖార్జునరావు, వాసు, నరేంద్ర, నాగేశ్వరరావు, మోహన్, సాయి, దేవిశెట్టి రామకృష్ణ, సూరపనేని పరందామయ్య, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు, మురాల నరేష్, యెనిగళ్ల నాగేశ్వరరావు, పళ్లెం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు నుంచి శుక్రవారం రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభకు ప్రజలు భారీగా తరలి వెళ్లారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబునాయుడు పాల్గొనే సభకు 16 గ్రామాల నుంచి 30 బస్సుల్లో ఉత్సాహంగా ప్రజలు బయలుదేరారు. మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, పలు గ్రామాల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా అమరావతికి తరలి వెళ్లారు.



నందివాడలో జెండా ఊపి అమరావతి సభకు తరలివెళ్తున్న చాట్రగడ్డ, గ్రామస్థులు



పామర్రులో బస్సులను టీడీపీ జెండా ఊపి ప్రారంభిస్తున్న నాగజగదీశ్వరరావు



పెదపారుపూడి నుంచి అమరావతికి వెళ్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు



చినపులిపాక నుంచి అమరావతికి బయలుదేరుతున్న మహిళలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి నాగపడగ సమర్పణ



మోపిదేవి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గుంటూరు జిల్లా యాదవపాలెం గ్రామానికి చెందిన డొక్కు శివసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు వెండి నాగపడగను సమర్పించారు. కుటుంబ సభ్యులతో శుక్రవారం స్వామి వారిని దర్శించుకున్నారు. 525 గ్రాముల బరువు కలిగిన సుమారు రూ.65 వేలు విలువ వెండి నాగపడగను ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావుకు అందజేశారు.



బస్టాండ్ సెంటర్‌లో వాహనాలను పంపుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ



సుల్తానగరం వద్ద జెండా ఊపుతున్న కుంచె నాని, గోపు సత్యనారాయణ



పెడన నుంచి బయలుదేరి వెళ్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



అవనిగడ్డ నుంచి కార్యకర్తలను పంపుతున్న మండలి వెంకట్రామ్, కనపర్తి శ్రీనివాసరావు

రెట్టించిన ఉత్సాహంతో అమరావతికి..

● రాజధాని పునర్నిర్మాణ వేడుకకు భారీగా తరలిన జనం

మచిలీపట్నం టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్నిర్మాణ సభకు మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మాజీ ఎంపీ, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు బస్టాండ్ సెంటర్‌లో వాహనాలకు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, గంజాల రవి తదితరులు పాల్గొన్నారు. సుల్తానగరంలో మచిలీపట్నం మార్కెట్‌యార్డు ఛైర్మన్ కుంచే నాని, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అమరావతికి తరలివెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు లంకే శేషగిరి, తలారి సోమశేఖర్, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, పామర్తి లక్ష్మణ, లంకే హరికృష్ణ, రాజులపాటి సత్యనారాయణ పాల్గొన్నారు. **పెడన** : రాజధాని అమరావతి పునః నిర్మాణ సభకు పెడన పట్టణం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. పురపాలక సంఘ కార్యాలయానికి చేరుకున్న పది బస్సులలో కూటమి నాయకులు ఆయా సచివాలయాల పరిధి



లంకలకలవగుంట నుంచి తరలివెళ్తున్న మహిళలు

లోని ప్రజలను బస్సులు ఎక్కించి అమరావతికి పంపారు. **పెడన రూరల్** : అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి గ్రామాల నుండి కూటమి నాయకులు, యువకులు, మహిళలు 500 మందికి పైగా తరలివెళ్లారు. బస్సులు చాలక నిలబడి ప్రయాణం చేశారు. **గూడూరు** : దేశ ప్రధాని నరేంద్ర మోడి చేతుల మీదుగా శుక్రవారం జరిగే రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమానికి గూ



గూడూరు నుంచి తరలి వెళ్తున్న టీడీపీ కార్యకర్తలు

డూరు నుంచి కూటమి నాయకులు శుక్రవారం భారీగా తరలి వెళ్లారు. గూడూరులో కూటమి నాయకులు ఎన్ఏ బేగ్, కొఠారి మురళీధరరావు, దాసరి రజని పాల్గొన్నారు. **అవనిగడ్డ** : అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల నుంచి బయలుదేరిన బస్సులు అవనిగడ్డకు చేరుకోగా, అవనిగడ్డ ఆంజనేయస్వామి ఆలయం వద్ద టీడీపీ రాష్ట్ర నేత కనపర్తి శ్రీనివాసరావు, జనసేన నేత మండలి వెంకట్రామ్, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకట గిరి జెండాలను ఊపి ప్రారంభించారు. నియోజకవర్గ ప్రముఖులు శీలం అశ్విన్ కుమార్, దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే కనకదుర్గ, కూటమి నేతలు బచ్చు రఘునాథ్ ప్రసాద్, మర్రే గంగయ్య, శోభిల ఏడుకొండలు, దాసినేని శ్రీనివాసరావు, బచ్చు కృష్ణకుమారి, బండే రాఘవ, విశ్వనాథుని మురళీ, సిద్ధినేని అశోక్ నాయుడు పాల్గొన్నారు. **కోడూరు** : లింగారెడ్డిపాలెం, ఉల్లిపాలెం, విశ్వనాధపల్లి, పిట్టలంక, సాలెంపాలెం, కోడూరు గ్రామాల నుంచి ఆరు ప్రత్యేక బస్సులలో పార్టీ శ్రేణులు అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్మికులు తరలివెళ్లారు. మర్రె గంగయ్య, వడుగు నాగబాబుతోపాటు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు అమరావతికి వెళ్లారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డ నుంచి రెండు బస్సుల్లో అమరావతికి జనం తరలివెళ్లారు. అమరావతి పునఃనిర్మాణానికి విచ్చేస్తున్న సందర్భంగా మాజీ సర్పంచ్ చెన్ను గాంధీ, ఎస్సీ నాయకులు వినయ్ ఆధ్వర్యంలో అమరావతికి బయలుదేరి వెళ్లారు. **నాగాయలంక** : రాజధాని అమరావతి పునః ప్రారంభోత్సవం సభకు మండలం నుంచి ఆరు ప్రత్యేక ఆర్టీసీ బస్సులలో 300 మంది తరలివెళ్లారు. ప్రధాని బహిరంగ సభకు అవనిగడ్డ ఆర్టీసీ యాజమాన్యం ఎక్కువ బస్సులను కేటాయించింది. దీంతో దూర ప్రాం తాలకు వెళ్లే ప్రయాణికులు అసౌకర్యానికి లోనయ్యారు. **ఘంటసాల** : అమరావతి రాజధాని పునఃనిర్మాణ పనుల ప్రారంభానికి మండలం నుంచి భారీగా జనం తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పది బస్సులు ఏర్పాటు చేయగా, సుమారు 500 మంది వెళ్లారు. ఉదయం 9 గంటలకు



కొడాలిలో బస్సులకు జెండా ఊపుతున్న తుమ్మల చౌదరిబాబు



చల్లపల్లి, పులిగడ్డ నుంచి తరలివెళ్తున్న కార్యకర్తలు

కొడాలి సెంటర్‌లో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు జెండా ఊపి బస్సులు ప్రారంభించారు. అమరావతి వెళ్తున్న ప్రజలకు అల్పాహారం, భోజనం, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లతోపాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచారు. ఎంపీడీవో సుబ్బారావు, తహసీల్దార్ విజయప్రసాద్, టీడీపీ నేతలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **మోపిదేవి** : అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి 500 మందికిపైగా పది బస్సుల్లో తరలివెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులను మోపిదేవిలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, ఎంపీపీ రావి దుర్గావాణి జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలు, కార్యకర్తలకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా అల్పాహారం, భోజనం, మంచినీరు వివిధ శాఖల ఆధ్వర్యంలో సమకూ



విశ్వనాథపల్లి గ్రామం నుంచి బయలుదేరుతున్న బస్సు

ర్చారు. ఎంపీడీవో జె.స్వర్ణభారతి, వెలుగు ఏపీఎం డి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ కె.టి.సుందరి, జనసేన, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, సనకా ప్రశాంత్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : నవ్యాంధ్ర రాజధాని అమరావతి పునఃప్రారంభ కార్యక్రమానికి మండలం నుంచి 10 బస్సుల్లో ప్రజలు బయలుదేరి వెళ్లారు. మహిళలు, రైతులు, ప్రజలు, పార్టీశ్రేణులు తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు దగ్గరుండి ప్రజలను బస్సుల్లో ఎక్కించి పంపగా, చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులు, పార్టీ నేతలు ఏర్పాట్లు పరిశీలించి బస్సులను పంపారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, ఉమామహేశ్వరరావు, పిట్టి రాంబాబు, చెరుకూరి శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.



మోపిదేవి నుంచి బయలు దేరుతున్న కార్యకర్తలు



సమ్మెట ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల సంఘం నాయకులు

ఆప్తా వ్యవస్థాపక అధ్యక్షుడు సమ్మెట ప్రసాద్‌కు సత్కారం

అవనిగడ్డ, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఆప్తా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సమ్మెట ప్రసాద్ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. ఆప్తా వ్యవస్థాపక అధ్యక్షుడు సమ్మెట ప్రసాద్ అవనిగడ్డకు వచ్చిన సందర్భంగా నవజీవన్ విద్యాసంస్థ ఆవరణలో ఆయనను ఘనం గా సత్కరించారు. విద్యావేత్త కొండవీటి ఈశ్వరరావు, జనసేన నేత రాజనాల వీరబాబు సమ్మెట ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఎంతో మందిని విద్యావంతులను చేసిన ప్రసాద్‌ను కొనియాడారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు (ఇండియా) న్యూ ఢిల్లీ సంఘ నాయకులు బడే ప్రభాకర్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నేతలు శివనాగరాజు, సునీల్ కుమార్ పట్నాయక్, కోసూరు ధర్మ ప్రసాద్, నాదెళ్ల ప్రసాద్, ఆర్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామికి తెల్ల జిల్లేడు పుష్పార్చన

నాగాయలంక, మే 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కృష్ణానదీ తీరాన వేంచేసి ఉన్న గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా రామలింగేశ్వరస్వామికి దశ సహస్ర తెల్ల జిల్లేడు పుష్పాలతో అర్చకులు కౌశిక్ బ్రహ్మత్వంలో పుష్పార్చన వైభవంగా జరిగింది. భక్తులు విరివిగా విచ్చేసి జయప్రదం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలూరు శ్రీనివాసరావు, సభ్యులు పర్యవేక్షించారు.

యోగ సాధకులకు సర్టిఫికెట్ల ప్రదానం రేపు

చల్లపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మహాసూర్య వందనం - 2025 పేరుతో ఉభయ తెలుగు రాష్ట్రాల యోగా చైతన్య యాత్రలో భాగంగా 108 నిముషాలలో 108 సూర్య నమస్కారాలు పూర్తిచేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన యోగా సాధకులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం యార్లగడ్డలోని ఆయుష్ ఆరోగ్యా యోగా మందిరంలో జరుగుతుందని యోగా గురువు ఎం.నాగరాజు, శేషప్రసన్న, శ్రీనివాసరావు తెలిపారు. సర్టిఫికెట్ల ప్రదానంతోపాటు యోగాసనాల ప్రదర్శన జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే మం డలి బుద్ధప్రసాద్, కలెక్టర్ డికె.బాలాజీ, మహాసూర్యవందన ప్రపంచ రికార్డు రూపకర్త పతంజలి శ్రీనివాస్, ప్రముఖులు పాల్గొంటారని వివరించారు.

ఎద్దుల బండిని ఢీకొన్న బస్సు

● ఎద్దు మృతి, రైతుకు గాయాలు



గాయపడిన మోర్ల గోపయ్య

మోపిదేవి, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఎద్దుల బండిని స్కూల్ బస్సు ఢీకొనటంతో ఎద్దు చనిపోయి బండి దెబ్బతిన్న ఘటన శుక్రవారం మోపిదేవి వార్పు వద్ద జరిగింది. ఉత్తర చిరువోలు లంక గ్రామానికి చెందిన మోర్ల గోపయ్య బుసక లోడు వేసుకుని పులిగడ్డ వెళ్లాడు. బుసక అన్ లోడ్ చేసి తిరిగి వస్తుండగా, వార్పు వద్ద బ్రిడ్జిపై స్కూల్ బస్సు ఢీకొట్టింది. అక్కడికక్కడే ఎద్దు చనిపోగా, బండి పాక్షికంగా దెబ్బతింది. బండిపై ఉన్న గోపయ్యకు తీవ్రంగా గాయాలయ్యాయి. గ్రామస్థులు సమాచారంతో 108 సిబ్బంది గోపయ్యకు ప్రథమ చికిత్స చేసి అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



పులిగడ్డ సర్పంచ్‌కు సత్కారం

అవనిగడ్డ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ పొందిన పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌ను బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు, ఎస్సీ సెల్ నాయకులు మద్దాల వీరాస్వామి, ముస్లిం మైనార్టీ నాయకులు పఠాన్ క రీముల్లా ఖాన్ శుక్రవారం ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ భార్గవ్ పాల్గొన్నారు.



ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభం

పెడన : కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటే ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా నెట్టుకురాగలరని డీవైఈవో శేఖర్‌సింగ్ అన్నారు. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను శుక్రవారం శేఖర్‌సింగ్ ప్రారంభించారు. రిటైర్డు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ, డిజిటలైజేషన్ కారణంగా కంప్యూటర్ విద్యకు ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. విద్యార్థులు వేసవి సెలవులు సద్వినియోగం చేసేందుకు వీలుగా కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న నిర్వాహకులు అభినందనీయులన్నారు. ఎండి ఉస్మాన్‌బాషా, మామిడి ప్రసాద్, రౌతుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

● జిల్లా పార్టీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ

పెడన, మే 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ అన్నారు.

బంటుమిల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పెడన నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయాన్ని పీసీసీ ఓబీసీ సెల్ ఛైర్మన్ శొంఠి నాగరాజుతో కలిసి గొల్లు కృష్ణ శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు బాబ్జీ, అమీర్, యూనిస్ తదితరులు పాల్గొన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి పెడన కాంగ్రెస్ నాయకులెవరూ హాజరుకాకపోవడం గమనార్హం. గత సాధారణ ఎన్నికలలో అప్పటి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా లింగాల సుధాకర్‌ను కాదని అధిష్టానం శొంఠి నాగరాజుకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిం ది. నాగరాజుకు టికెట్ ఇవ్వడాన్ని పెడన కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పటి నుంచి నాగరాజు, పెడన నాయకులకు మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో పెడన నాయకులు నాగరాజుకు దూరంగా ఉంటూ వస్తున్నారు. స్పర్థల కారణంగా పార్టీ కార్యక్రమాలలో స్తబ్ధత ఏర్పడింది. నాగరాజుకు, పెడన నాయకులకు మధ్య తలెత్తిన విభేదాలను తొలగించి వీరిని సమన్వయం చేయాల్సిన అధిష్ఠానం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా నాయకుల మధ్య దూరం కొనసాగుతూనే ఉంది



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి రామకృష్ణయ్య

కార్మికుల హక్కులను పరిరక్షించాలి

మచిలీపట్నం టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు యాజమాన్యాలు సహకరించాలని సీనియర్ న్యాయాధికారి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య మాట్లాడారు. పేద ప్రజలు, ఉద్యోగులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. సంఘ నాయకులు జి. కిషోర్‌కుమార్, జె. సుధాకర్, డి. వాసు, ఎల్. రాజశేఖర్, ఏ. శ్రీనివాసరావు, వై. స్వామినాథన్, డి.ఎస్. మాధూర్ తదితరులు మాట్లాడారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

మచిలీపట్నం టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి నిరసనగా మచిలీపట్నంలో శుక్రవారం జమా మస్జిద్ వద్ద జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ద్వారా తీసుకుని వచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



ఒంటికాలిపై నిరసన

మచిలీపట్నం టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ అధికారుల సమ్మె ఐదో రోజుకు చేరింది. శుక్రవారం ఒంటి కాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. నాయకులు మౌనిక, సానిక, శివదుర్గ, దివ్య, స్వీటీ, శిరీష, వైష్ణవి, రమ్య, నిఖిత, అన్నామణి, సుహాసిని, పావని, షఫి తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుని బోధనల్లో వేదాంత రహస్యాలు

మచిలీపట్నం టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఆదిశంకరాచార్యుల బోధనల్లో వేదాంత రహస్యాలు దాగి ఉన్నాయని డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య అన్నారు. ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా ఆదిశంకరాచార్యులు అందించిన ఆధ్యాత్మిక సాహిత్యం పై ధన్వంతరీ ఆచార్య ప్రసంగించారు. డాక్టర్ బి. సారంగపాణి, సాహిత్య విమర్శకులు ఎస్. వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, భవిష్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువు 5

మచిలీపట్నం టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అపరాధ రుసుం లేకుండా ఈనెల 5వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ఆర్ఐఓ పి.బి. సాల్మన్‌రాజు తెలిపారు. ఈ నెల 12 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.